



Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక






శనివారం 16-05-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 335 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## బండి సంజయ్ తల్లి శకుంతలకు గుండెపోటు



హైదరాబాద్ (ఇది కద నిజం): కేంద్ర మంత్రి బండి సంజయ్ తల్లి శకుంతల గుండెపోటుకు గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఆమెను గచ్చిబౌలిలోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. శకుంతల గుండెకు వైద్యులు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

2 లో

## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం



హైదరాబాద్: హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన డిజిటల్ మీడియా సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాబోయే దశాబ్ద కాలంలో తెలంగాణ అభివృద్ధి, సాంకేతికత మరియు మీడియా పాత్ర అనే ప్రధానాంశాలపై జరిగిన ఈ సదస్సుకు ఐటీ, రాజకీయ, పారిశ్రామిక రంగాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించిన అనంతరం, నేటి సమాజంలో డిజిటల్ మాధ్యమాల ప్రాధాన్యతను వివరిస్తూ కీలక ప్రసంగం చేశారు.

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో డిజిటల్ మీడియా పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. వార్త ఎంత వేగంగా సామాన్యుడికి చేరుతుందనే దానికంటే, అది ఎంతవరకు నిజం అనే విశ్వసనీయతను కాపాడుకోవడం ప్రతి డిజిటల్ వేదిక యొక్క ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. నకిలీ వార్తల వల్ల సమాజానికి జరిగే నష్టాన్ని అరికట్టడంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు మరింత అప్రమత్తంగా మరియు జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.

2 లో

## ఆ రోజే అనుమానం వచ్చింది

- పెట్రోల్ ధర పెరుగుదలపై మంత్రి సంచలన వ్యాఖ్యలు..



ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు.

2 లో

## నిర్వాసితుల కోసమే పోలవరం జిల్లా



అమరావతి, మే 15:పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై చిత్తుశుద్ధి ఉందని... పోలవరం నిర్వాసితుల పట్ల అభిమానంతో ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శుక్రవారం పుట్టపర్తి పర్యటన ముగించుకుని అమరావతి చేరుకున్న అనంతరం క్యాంప్ కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. పోలవరం నిర్వాసితులకు రూ.306.61 కోట్ల పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని సీఎం చంద్రబాబు అందించారు. అలాగే పలువురు లబ్దిదారులకు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో ఇళ్ల తాళాలను అందించారు. ఇళ్ల పట్టాల నిమిత్తం 62.05 ఎకరాలు, ల్యాండ్ టూ ల్యాండ్ కింద 520.02 ఎకరాలను గుర్తించినట్టు అధికారులు వెల్లడించారు. 23 నెలల్లో ఇప్పటికే మూడు దఫాలుగా నిర్వాసితులకు పరిహారం అందించిన సీఎం... శుక్రవారం నాలుగో విడతలో మరికొంతమంది నిర్వాసితులకు పరిహారం అందించారు. 2025 ఏడాదిలో సంక్రాంతి, దీపావళి సందర్భంగా రెండు సార్లు 2026 ఏడాదిలో ఉగాది సందర్భంగా మూడోసారి, ఇవాళ కాటన్ దొర జయంతి సందర్భంగా నాలుగో విడత పోలవరం నిర్వాసితులకు ముఖ్యమంత్రి పరిహారం అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 29,936 మంది నిర్వాసితులకు సుమారు రూ.2,250 కోట్ల పరిహారాన్ని పోలవరం నిర్వాసితులకు చెల్లించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కాటన్ దొర జయంతి రోజున పోలవరం నిర్వాసితులతో సమావేశం కావడం... ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులు ఇవ్వడం ఆనందంగా ఉంది.

2 లో

## మంగళగిరిలో 'జనసేన' శంఖారావం



మంగళగిరి: మంగళగిరి పరిసర ప్రాంతంలో జనసేన పార్టీ క్రియాశీలక ఉద్యమ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుండి పార్టీ కోసం అలుపెరగకుండా శ్రమిస్తున్న ముఖ్య నాయకులు, ఉద్యమ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాబోయే రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణను ఖరారు చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ సభలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి దిశా నిర్దేశం చేశారు. వేదికపైకి పవన్ కళ్యాణ్ రాగానే కార్యకర్తల నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది.

సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. జనసేన పార్టీకి అసలైన బలం, శ్వాస మన ఉద్యమ కార్యకర్తలేనని కొనియాడారు. పదవుల కోసం కాకుండా, సమాజ మార్పు కోసం మరియు ప్రజల భవిష్యత్తు కోసం కష్టపడే తత్వం ఒక్క జనసేన సైనికులకే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఎన్నో ఎదురుదెబ్బలు తగిలినా, అపనిందలు ఎదురైనా వెనకడుగు వేయకుండా పార్టీ జెండాను గుండెలకు హత్తుకుని నడిపించిన ప్రతి ఒక్క కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు.

2 లో

## పుట్టపర్తి చెంత 'రక్షణ' శంఖారావం

- దేశ రక్షణ రంగంలో సరికొత్త అధ్యాయం
- కేంద్ర, రాష్ట్రాల డబుల్ ఇంజన్ జోరు
- లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు
- మేక్ ఇన్ ఇండియా -- మేడ్ ఇన్ ఏపీ



పుట్టపర్తి/అమరావతి:

భారతదేశ రక్షణ రంగ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త మైలురాయిని అధిగమించింది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి సమీపంలో అత్యంత వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన 'జాతీయ రక్షణ ప్రాజెక్టు'కు అధికారికంగా శ్రీకారం చుట్టారు. దేశ భద్రతను పటిష్టం చేయడంతో పాటు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రక్షణ రంగానికి అవసరమైన కీలక పరికరాలను ఇక్కడ ఉత్పత్తి చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధినేతలు వేదికగా నిలిచారు.

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంయుక్తంగా ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రిబ్బన్ కట్ చేసి, పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు ప్రాజెక్టు నమూనాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఇరువురు నేతలు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు కేవలం ఏపీకే కాకుండా యావత్ భారతదేశానికి గర్వకారణంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఆత్మ నిర్భరత దిశగా..!

సభలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం రక్షణ రంగంలో స్వయంసమృద్ధి (ఆత్మనిర్భరత) సాధిస్తోంది. ఒకప్పుడు రక్షణ పరికరాల కోసం విదేశాల వైపు చూసిన మనం, నేడు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాం. పుట్టపర్తిలో ఏర్పాటు కాబోతున్న ఈ జాతీయ ప్రాజెక్టు దేశ సరిహద్దుల భద్రతలో అత్యంత కీలకమైన పాత్ర పోషించబోతోంది" అని ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ భౌగోళిక పరిస్థితులు, లభించే వనరులు రక్షణ రంగానికి ఎంతో అనుకూలమైనవని రాజ్ నాథ్ సింగ్ కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ నాయకత్వంలో ఏపీ పారిశ్రామికంగా వేగంగా దూసుకుపోతోందని ఆయన ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో రక్షణ రంగానికి సంబంధించిన మరిన్ని అనుబంధ పరిశ్రమలు ఇక్కడికి వస్తాయని ఆయన హామీ ఇచ్చారు.

### సత్య సాయి బాబా ఆశీస్సులు

అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, పుట్టపర్తి పుణ్యభూమిపై ఇటువంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రావడం శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సుల బలమేనన్నారు. ఏపీని గ్లోబల్ డిఫెన్స్ హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచస్థాయి మౌలిక వసతులు, నిరంతర విద్యుత్, పారదర్శకమైన సింగిల్ విండో అనుమతుల వల్లే కేంద్రం ఈ ప్రాజెక్టు కోసం ఏపీని ఎంచుకుందని సీఎం సగర్వంగా పేర్కొన్నారు.

రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఒక గేమ్ ఛేంజర్ కాబోతోందని చంద్రబాబు నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. కరువు ప్రాంతంగా ముద్రపడిన రాయలసీమ.. ఇకపై 'రక్షణ పారిశ్రామిక కారిడార్'గా మారబోతోందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, స్థానిక యువతకు రక్షణ సాంకేతికతలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

2 లో

## తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం



హైదరాబాద్ (ఇది కద నిజం): తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కారులను గుర్తించి, వారి సేవలు--త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీఓ ఆర్టీ నం. 679 జారీ చేసింది. ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో, వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలాకాలంగా ఉన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్ , ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం , ఎమ్మెల్సీ--విప్ అద్దంకి దయాకర్ , మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ , మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు.

2 లో

## బండి భగీరథ్ ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్



బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో సుదీర్ఘ వాదనలు ముగిశాయి. అర్ధరాత్రి వరకు కొనసాగిన విచారణ అనంతరం కోర్టు తీర్పును రిజర్వ్‌లో ఉంచింది.

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, బాధితురాలి తల్లి చేసిన ఫిర్యాదులో డిసెంబర్ 31న ఫామ్‌హౌస్‌లో జరిగిన ఘటనలను ప్రస్తావించినట్లు తెలిపారు. అక్కడ బాధితురాలు, నిందితుడు సహా మరికొందరు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. స్నేహితులు తీసిన ఫోటోలు, వీడియోలను పరిశీలిస్తే బాధితురాలు స్వచ్ఛందంగానే మద్యం సేవించినట్లు కనిపిస్తోందని వాదించారు.

2 లో

# పుట్టపర్తి చెంత 'రక్షణ' శంఖారావం

మొదటి పేజీ తరువాయి



ఈ ప్రాజెక్టు ద్వారా 'మేక్ ఇన్ ఇండియా' సంకల్పానికి 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' బ్రాండ్ తోడు కాబోతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రక్షణ రంగానికి చెందిన ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములు కానున్నాయి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే అత్యాధునిక రక్షణ సామాగ్రిని మన సైన్యానికి అందించడమే కాకుండా, మిత్రదేశాలకు కూడా ఎగుమతి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

మొదటి దశలోనే ఈ ప్రాజెక్టు కోసం వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు కేంద్ర రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. పనులను వేగవంతం చేసి, రికార్డు సమయంలోనే ఉత్పత్తిని ప్రారంభించేలా కాలపరిమితిని నిర్దేశించుకున్నారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, రోడ్ల కనెక్టివిటీ, నీటి సరఫరా వంటి పనులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పూర్తి చేసిందని అధికారులు వెల్లడించారు.

రక్షణ ప్రాజెక్టు రాకతో పుట్టపర్తి, హిందూపురం మరియు పరిసర ప్రాంతాల్లో భూముల విలువ పెరగడంతో పాటు వ్యాపార, వాణిజ్య రంగాలు ఊపందుకోనున్నాయి. హోటల్ రంగం, రవాణా, లాజిస్టిక్స్ పరిశ్రమలకు భారీ డిమాండ్ ఏర్పడనుంది. అనంతపురం జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారులు, బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉన్న సామీప్యత ఈ ప్రాజెక్టు విజయానికి మరింత బలాన్ని చేకూర్చనున్నాయి.

ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర రక్షణ శాఖ ఉన్నతాధికారులు, ఏపీ మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పుట్టపర్తి చెంత రక్షణ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడంతో రాయలసీమ ప్రజల్లో సరికొత్త ఆశలు, ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఏపీ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే సరికొత్త శకానికి ఈరోజు పుట్టపర్తి వేదికగా పునాది పడిందని చెప్పవచ్చు.

# బండి సంజయ్ తల్లి శకుంతలకు గుండెపోటు



హైదరాబాద్ (ఇది కద నిజం): కేంద్ర మంత్రి బండి సంజయ్ తల్లి శకుంతల గుండెపోటుకు గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఆమెను గచ్చిబౌలిలోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. శకుంతల గుండెకు వైద్యులు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.బండి సంజయ్ కూడా మెడికవర్ ఆసుపత్రికి చేరుకున్నారు. తల్లి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. శకుంతలకు గుండెపోటు రావడంతో బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

# నిర్వాసితుల కోసమే పోలవరం జిల్లా

మొదటి పేజీ తరువాయి

సంక్రాంతి, దీపావళి, ఉగాది ఇలా పండుగలకు పోలవరం నిర్వాసితులకు నిధులు అందిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద కమిట్మెంట్ ఉంది.. నిర్వాసితుల మీద అభిమానం ఉంది. ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదు.. ఇబ్బందులు పడకూడదనేదే నా




ఆలోచన. పోలవరం నిర్వాసితులు కోసమే పోలవరం జిల్లా ఏర్పాటు చేశాం. టెక్నాలజీ అనుసంధానం చేసి ప్రతీ కుటుంబ ఆదాయం పెంచుతాం. గిరిజన నియోజకవర్గాలైన పోలవరం, రంపచోడవరంను అన్ని విధాలా తీర్చిదిద్దుతాం. పోలవరం ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తవుతుంది. నిర్వాసితుల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగదు. ప్రాజెక్టు, టౌన్ షిప్, ఇండస్ట్రీ ఇలా ఏం వచ్చినా త్యాగం చేసేది రైతులే. వారసత్వంగా వచ్చిన భూములు పోతే బాధపడతారు... నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వను. రంపచోడవరంలో బ్రహ్మాండమైన రోడ్లు నిర్మిస్తున్నాం. 2022లో వరదల సమయంలో పోలవరం ప్రాంతంలో నేను పర్యటించాను. వరద బాధితులకు కనీసం భోజనం, నీళ్లు కూడా నాటి ప్రభుత్వం ఇవ్వలేదు. విశాఖలో హుద్ హుద్ వచ్చినప్పుడు వారం రోజులు అక్కడే ఉండి పరిస్థితి చక్కదిద్దాం. 2019 కూడా తర్వాత మా ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం 2020కి పూర్తయ్యేది. గత ప్రభుత్వ నిర్వాకం, నిర్లక్ష్యం వల్ల డయా ఫ్రమ్ వాల్ దెబ్బతినేలా చేశారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేశారు. గత పాలకులు అధికారులను మార్చారు... కాంట్రాక్టరును మార్చారు... ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాం... 2027 పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకిత చేస్తాం. గోదావరి – కావేరి నదుల అనుసంధానం జరుగుతుంది. గంగా –– కావేరి నదుల అనుసంధానం కావాలనేది నా కోరిక. ఇది చేస్తే దేశంలో నీటి ఎద్దడి అనేది ఉండదు"అని ముఖ్యమంత్రి అన్నారు

చంద్రబాబు సీఎం అయ్యాకే మాకు మంచి రోజులు: నిర్వాసితులు

సీఎం చంద్రబాబు పోలవరం నిర్వాసితులతో నిర్వహించిన ముఖాముఖిలో నిర్వాసితులు తమ అభిప్రాయాలను... క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు. గతంలో పరిహారం, ఆర్ అండ్ ఆర్ పనులు ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా జరుగుతున్నాయనే అంశాన్ని సీఎంకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద... తమ పరిహారం మీద తాము పూర్తిగా నమ్మకాన్ని కోల్పోయామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద... తమకు అందే పరిహారం మీద నమ్మకం కలిగిందని నిర్వాసితులు చెప్పారు. చంద్రబాబు సీఎం అయ్యాకే... 23 నెలల కాలంలో నాలుగు విడతలుగా పరిహారం చెల్లింపులు జరుపుతున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లో కూడా గత పాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిర్వాసితులు వివరించారు. పోలవరం నిర్వాసితులకు డబ్బులివ్వలేనని... తాను ఏం చేయలేనని నాటి సీఎం జగన్ చెప్పడంతో తాము ఆందోళన చెందామని పోలవరం నిర్వాసితులు వివరించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలకు గత ప్రభుత్వం రోడ్లు కూడా వేయలేదని పలువురు ముంపు గ్రామాల ప్రజలు సీఎంకు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం నిర్వాసితులుగా తమను పట్టించుకోకపోవడమే కాకుండా... వరదల సమయంలో సర్వం కోల్పోయిన తమకు కనీసం బియ్యం పంపిణీ కూడా చేపట్టలేదంటూ నాడు జరిగిన సంఘటనలను సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జలవనరుల శాఖ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పోలవరం జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో 'జనసేన' శంఖారావం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ప్రజాపక్షంగా నిలబడి, వారి గొంతుకను వినిపించడంలో జనసేన ఎప్పుడూ ముందే ఉంటుందని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకుండా, సమాజంలో జవాబుదారీతనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని, ప్రభుత్వ విధానాల్లో లోపాలను ఎండగట్టడంలో కార్యకర్తలు మరింత చొరవ చూపాలని ఆయన సూచించారు.

పార్టీని గ్రామ స్థాయి నుండి మరింత బలోపేతం చేసేందుకు సరికొత్త కార్యాచరణను ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. కార్యకర్తల రక్షణకు, వారి సంక్షేమానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా మరియు క్షేత్రస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కోరారు. రాబోయే రోజుల్లో జనసేన ఉద్యమ తీవ్రతను మరింత పెంచుతామని, ప్రజల ఆశయాలకు అనుగుణంగానే తమ ప్రయాణం సాగుతుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రగతిని ప్రస్తావిస్తూ, రాబోయే పదేళ్లలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఐటీ, అత్యాధునిక పరిశ్రమలతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మరింత విస్తరిస్తామని, మెట్రో రైల్ రెండో దశ విస్తరణ మరియు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల ద్వారా నగర రూపురేఖలను పూర్తిగా మార్చబోతున్నామని ఆయన వెల్లడించారు.

రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలన, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యతని, కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా వేలాది మందికి లబ్ధి చేకూరుస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇదే వేదికపై దేశ రాజకీయాలను ప్రస్తావిస్తూ, దేశ భవిష్యత్తు మరియు ప్రజాస్వామ్య రక్షణకు 'ఇండియా' కూటమి తరఫున రాహుల్ గాంధీ సరైన ప్రధానమంత్రి అభ్యర్థి అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

డిజిటల్ మీడియా కేవలం వార్తలను అందించడానికే పరిమితం కాకుండా, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మరియు వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపడంలో వంతెనలా పనిచేయాలని సీఎం ఆకాంక్షించారు. సదస్సు ముగింపులో నిర్వాహకులు ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు.

# బండి భగీరథ్ ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్


మొదటి పేజీ తరువాయి

అలాగే, తన క్లయింట్‌పై జరుగుతున్న దుష్ప్రచారానికి సమాధానం ఇవ్వడానికే ఈ విషయాలను ప్రస్తావిస్తున్నామని న్యాయవాది తెలిపారు. బాధితురాలి తల్లికి విషయం తెలిసిన వెంటనే ఎందుకు ఫిర్యాదు చేయలేదని కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

మరోవైపు, బాధితురాలు మైనర్ అని ఆమె తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. ఇందుకు ఆధారంగా పదో తరగతి మెమోను సమర్పించారు.

# తెగిపడ్డ అపార్ట్‌మెంట్ లిఫ్ట్..

## ఆరుగురు బీఆర్ఎస్ నాయకులకు గాయాలు.!



మణికొండలోని డాలర్ హిల్స్‌లో శనివారం లిఫ్ట్ ప్రమాదం చోటుచేసుకుంది. ఒక అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ వైర్లు ఒక్కసారిగా తెగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించడమే కాకుండా అపార్ట్‌మెంట్‌లోని నివాసితులను భయాందోళనకు గురిచేసింది.

డాలర్ హిల్స్‌లోని ఒక అపార్ట్‌మెంట్ ఐదవ అంతస్తులో రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి చేయబోయే పాదయాత్ర కు సన్నాహక సమావేశం జరిగింది. ఈ మీటింగ్ ముగించుకుని ఆరుగురు నాయకులు గ్రౌండ్ ఫ్లోర్‌కు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ కిందకు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా సాంకేతిక లోపం తలెత్తి, వైర్లు తెగిపోయాయి. దీంతో లిఫ్ట్ నేరుగా ఐదో అంతస్తు నుండి కిందకు కుప్పకూలిపోయింది. లోపల ఉన్న వారు ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ప్రమాదం జరిగిపోయింది.

ఈ ప్రమాదంలో లిఫ్ట్‌లో ఉన్న ఆరుగురు నాయకులకు గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి అత్యంత తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. లిఫ్ట్ వేగంగా కిందకు పడటంతో ప్రభావం ఎక్కువగా ఉండి ఇద్దరి కాళ్లు విరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అపార్ట్‌మెంట్ వాసులు, ఇతర నాయకులు స్పందించి క్షతగాత్రులను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని అత్యవసర చికిత్స నిమిత్తం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

# ఆ రోజే అనుమానం వచ్చింది

మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.

గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఇదిలా ఉండగా.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల, పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా దేశవ్యాప్తంగా ఇంధన ధరల మోత మోగింది. చమురు విక్రయ సంస్థలు పెంచిన ధరల కారణంగా మే 15న దేశంలోని ప్రధాన నగరాల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు భారీగా పెరిగాయి. తాజా పెంపుతో దేశంలోని ప్రముఖ నగరాలన్నింటికంటే తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోనే పెట్రోల్ ధర అత్యధికంగా ఉన్నాయి. నగరంలో లీటరు పెట్రోల్‌పై ఏకంగా రూ. 3.39 పెరగడంతో ప్రస్తుతం లీటరు ధర రూ. 110.89 కి చేరింది. ఈ జాబితాలో కేరళ రాజధాని తిరువనంతపురం రెండో స్థానంలో నిలిచింది. అక్కడ రూ. 3.37 పెరగడంతో లీటరు పెట్రోల్ ధర రూ. 110.75 కి చేరింది. ఆ తర్వాతి స్థానాల్లో కోల్‌కతా (రూ. 108.74), పాట్నా (రూ. 108.55), జైపూర్ (రూ. 108.19) నిలిచాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో పెట్రోల్ ధర రూ. 106 దాటి లీటరు రూ. 106.64 వద్ద విక్రయిస్తున్నారు.

పెట్రోల్‌తో పాటే డీజిల్ ధరలు దేశవ్యాప్తంగా పైపైకి దూసుకెళ్లాయి. లీటరు డీజిల్ ధర అత్యధికంగా తిరువనంతపురంలో రూ. 99.63 (రూ. 3.37 పెంపు) గా నమోదై, సెంచరీ మార్కుకు చేరువులో నిలిచింది. ఈ జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. హైదరాబాద్‌లో లీటరు డీజిల్‌పై రూ. 3.26 పెరగడంతో ధర రూ. 98.96 కి ముట్టింది. ఆ తర్వాత భువనేశ్వర్ (రూ. 96.11), చెన్నై (రూ. 95.47), కోల్‌కతా (రూ. 95.13)లు ఉన్నాయి. మిగతా మెట్రో నగరాలతో పోలిస్తే దేశ రాజధాని ఢిల్లీలో ఇంధన ధరలు కొంత తక్కువగా ఉన్నాయి. అక్కడ లీటరు పెట్రోల్ ధర రూ. 97.77 గాను, డీజిల్ ధర రూ. 90.67 గాను కొనసాగుతోంది. ఈ ఆకస్మిక ధరల పెరుగుదల రవాణా రంగంతోపాటు సామాన్యుడి జేబుకు చిల్లుపడనుంది.

# తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది.

కమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. అవసరమైన ఇతర వ్యక్తులు, అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# పొదుపు మంత్రంపై కమల్‌హాసన్ కీలక వ్యాఖ్యలు



పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ దేశాల్లో సంక్షోభం నెలకొంది. అన్ని దేశాలు పొదుపు మంత్రాన్ని జపిస్తున్నాయి. ప్రస్తుతం భారత్‌లో కూడా సీరియస్‌గా అమలవుతోంది. పౌరులంతా పొదుపు పాటించాలని ప్రధాని మోడీ పిలుపు ఇచ్చారు. దీంతో మోడీ దగ్గర నుంచి రాష్ట్ర నాయకులంతా పొదుపు సూత్రాన్ని పాటిస్తున్నారు.

ఈ క్రమంలోనే సినీ పరిశ్రమకు సీనియర్ నటుడు, ఎంపీ కమల్‌హాసన్ కీలక సూచన చేశారు. "ప్రతి ప్రేమకథ తప్పనిసరిగా పారిస్‌లోనే మొదలవ్వాలా..? ప్రతి హనీమూన్ స్విట్జర్లాండ్‌లోనే ముగియాలా..?" అంటూ కమల్ హాసన్ సినీ పరిశ్రమలో వనరుల వినియోగంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, ఇంధన సంక్షోభ పరిస్థితుల్లో సినీ పరిశ్రమ కూడా ఖర్చుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అవసరం లేని విదేశీ షూటింగ్‌లు, భారీ ఖర్చులను తగ్గించి వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

స్థానిక ప్రాంతాలు, దేశీయ పర్యాటక కేంద్రాలను ప్రోత్సహించేలా సినిమాలు నిర్మిస్తే పరిశ్రమకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని కమల్ హాసన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ అయతుల్లా ఖమేనీ హతమయ్యారు. అనేక మంది ప్రభుత్వ పెద్దలు కూడా చనిపోయారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులు చేసింది. అంతేకాకుండా హార్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాలకు వెళ్లే నౌకలు నిలిచిపోయాయి. దీంతో చమురు, గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో పొదుపు మంత్రం పాటిస్తుండగా.. ప్రస్తుతం భారత్‌లో అమలవుతోంది.

# భారత్ మాస్టర్ ప్లాన్.. సముద్రగర్భంలో భారీ గ్యాస్ పైప్‌లైన్..



భారత్ సంక్షోభాలను అవకాశంగా మార్చుకుంటోంది. దేశ ఇంధన భద్రత కోసం భారీ ప్రాజెక్టుకు సిద్ధమైంది. అరేబియా సముద్రం గర్భంలో భారీ గ్యాస్ పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. హార్ముజ్ సంక్షోభం కారణంగా, ఈ ఇరుకైన సముద్ర మార్గంపై ఆధారపడకుండా నేరుగా గల్ఫ్ దేశాల నుంచి గ్యాస్ తెచ్చుకునేందుకు భారీ ప్రాజెక్టును చేపడుతోంది.

యూఏఈ–ఒమన్ నుంచి నేరుగా భారత్‌కు గ్యాస్ వచ్చే ప్రతిపాదిత ప్రాజెక్టుకు సుమారుగా రూ. 40,000 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తి కావడానికి ఐదు నుంచి ఏడేళ్లు పడుతుందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు చెందిన వర్గాలు చెబుతున్నాయి. ప్రైవేట్ కన్సార్టియం సౌత్ ఆసియా గ్యాస్ ఎంటర్‌ప్రైజ్ (SAGE) నిర్వహించిన అధ్యయనం ఆధారంగా ఒక నివేదికను సిద్ధం చేయమని ప్రభుత్వ రంగ సంస్థలైన GAIL, ఇంజనీర్స్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లను మంత్రిత్వ శాఖ కోరనున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి.

ఏమిటి ఈ పైప్‌లైన్..?

యూఏఈ, ఒమన్ మీదుగా అరేబియా సముద్రం గుండా ఈ పైప్‌లైన్ వెల్తుంది. 2500 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్ నిల్వులు ఉన్న ఒమన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఇరాన్, తుర్క్‌మెనిస్తాన్, ఖతార్ నుంచి గ్యాస్ పొందేందుకు ఈ పైప్‌లైన్ భారతదేశానికి వీలు కల్పిస్తుంది.

సుమారుగా 3450 మీటర్ల లోతు వరకు ఈ పైప్ లైన్ ఉండొచ్చు. ఇది ప్రపంచంలోనే అత్యంత లోతైన సముద్రగర్భ పైప్‌లైన్‌లలో ఒకటిగా నిలుస్తుంది. సముద్రగర్భ పరిస్థితుల్ని అంచనా వేయడానికి సేజ్ సంస్థ ఈ మార్గంలో రూ. 25 కోట్ల వ్యయంతో సుమారు 3000 మీటర్ల టెస్ట్ పైప్‌లైన్ వేసింది.

ఒక వేళ ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే హార్ముజ్‌ను పూర్తిగా బైపాస్ చేయవచ్చు. ట్యాంకర్ల అవసరం లేకుండా నేరుగా గ్యాస్ భారత్ చేరుతుంది. దీర్ఘకాలంలో గ్యాస్ చౌకగా మారే అవకాశం ఉంటుంది. ఇప్పటికే యూఏఈ తన భూభాగం నుంచి ఒమన్ తీరం వరకు చమురు పైప్ లైన్ నిర్మాణం చేయాలని భావిస్తుంది. ఇదే జరిగితే హార్ముజ్ ద్వారా వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒమన్ తీరం నుంచి చమురు ట్యాంకర్లు భారత్ చేరవచ్చు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 16-05-2026

# యాదగిరిగుట్ట దేవస్థానానికి జాతీయ స్థాయి గుర్తింపు

## ఈ-గవర్నెన్స్‌లో అద్భుత ప్రగతి




ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి జిల్లా: ఆధ్యాత్మిక వైభవంతో అలరారుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, తాజాగా డిజిటల్ సేవల రంగంలో జాతీయ స్థాయిలో సత్తా చాటింది. న్యూఢిల్లీలో జరిగిన 29వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సు లో భాగంగా, దేవస్థానం తరఫున ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె. భవానీ శంకర్ ప్రాజెక్ట్ ప్రజెంటేషన్‌ను సమర్పించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థల నుంచి వచ్చిన 802 అప్లికేషన్లలో, అత్యంత కఠినమైన వడపోత తర్వాత షార్ట్‌లిస్ట్ చేయబడిన కేవలం 32 ప్రాజెక్టులలో యాదగిరిగుట్ట చోటు దక్కించుకోవడం విశేషం. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ గౌరవం దక్కించుకున్న ఏకైక దేవస్థానం ఇదే కావడం గమనార్హం. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా, ఏప్రిల్ 2026లో జాతీయ అవార్డుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి డిజిటల్ పరివర్తనను పరిశీలించగా, తుది దశలో భాగంగా మే 14, 2026న ఢిల్లీలో జ్యూరీ సభ్యుల ముందు ఫైనల్ ప్రజెంటేషన్ విజయవంతంగా ముగిసింది. భక్తులకు పారదర్శకత, సౌలభ్యం మరియు సత్వర సేవలు అందించేలా దేవస్థానం చేపట్టిన డిజిటల్ సంస్కరణలకు జ్యూరీ నుండి విశేష స్పందన లభించింది. "తెలంగాణ తిరుపతి"గా విరాజిల్లుతున్న యాదగిరిగుట్టకు, ఈ జాతీయ స్థాయి గుర్తింపు దేవస్థాన ప్రతిష్టను మరింత పెంచడమే కాకుండా, ఆధునిక సాంకేతికతను భక్తి మార్గంలో మేళవించడంలో ఆదర్శంగా నిలిచింది.

# ఘనంగా ఐలేష్ యాదవ్ జన్మదిన వేడుకలు

## రామంతపూర్‌లో ఘనంగా బర్త్‌డే సెలబ్రేషన్స్



ఇది కద నిజం, హైదరాబాద్: రామంతపూర్ భగయత్ వెంకట సాయి నగర్ కాలనీ గౌరవ సభ్యులు ఐలేష్ యాదవ్ జన్మదిన వేడుకలు కాలనీవాసుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు, యువత, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐలేష్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి కనబరిచిన ఆయన, అనేక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. అవసరమైన వారికి తన వంతు సహాయం చేయడంలో ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తిగా ఆయనకు కాలనీలో ప్రత్యేక గుర్తింపు ఉంది. యువతలో సేవాభావం పెంపొందించేందుకు కూడా ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కాలనీవాసులు చెప్పారు. ఈ సందర్భంగా సభ్యులు రవికుమార్ మాట్లాడుతూ, ఐలేష్ యాదవ్ సమాజ సేవను నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని వారు అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి కాలనీ కమిటీ సభ్యులు ఆర్. గోవింద్, జి. అశోక్, సిహెచ్ శ్రీనివాస్ గౌడ్, విద్యాసాగర్, రమేష్, రామకృష్ణ , భూపతి నరసింహ, శివకుమార్ , రమేష్ యాదవ్ , కొల్ల నవీన్ కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలులో నిర్లక్ష్యం

## పిట్లంలో మాజీ ఎమ్మెల్యే హనుమాన్ సిందే ఆధ్వర్యంలో రైతుల ధర్నా

ఇది కద నిజం:ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా జొన్నల కొనుగోలు ప్రక్రియ నిలిచిపోయిందని ఆరోపిస్తూ, కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమాన్ సిందే నేతృత్వంలో రైతులు శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ సిందే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతులు సుఖంగా ఉండేవారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అన్నదాతలను విస్మరిస్తోందని విమర్శించారు. ఎన్నికల వేళ అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి, తీరా అధికారంలోకి వచ్చాక రైతులను గాలికొదిలేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. చిన్న పిల్లలకు చాక్లెట్ చూపి ఆశ పెట్టినట్లుగా కాంగ్రెస్ తీరు ఉందని ఎద్దేవా చేసిన ఆయన, వెంటనే జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# అవంతి విద్యార్థికి 14 లక్షలు వేతనముతో ఉద్యోగవకాశము




భీమిలి (ఇది కద నిజం): అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి బి.ఎల్. ఇంద్ర గీతిక కు అసోసియేట్ టెక్నికల్ సపోర్ట్ ఇంజనీర్ గా పెగా సిస్టమ్ క్యాంపస్ డ్రైవ్ లో 14 లక్షలు వేతనముతో కూడిన ఉద్యోగం అవకాశము లభించింది. అవంతి కళాశాలల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ... విద్యార్థిని కృషి, పట్టుదల, అంకితభావము, కష్టపడేతత్వం, అద్భుతమైన నైపుణ్యం కలిగి ఉందని అభినందించారు. ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ , డైరెక్టర్స్ డా. ఏ. చంద్రశేఖర్, ఎస్. విశ్వ ప్రసాద్ , కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ గండి సత్యనారాయణ , వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు ఇంద్ర గీతికకు అభినందనలు తెలిపారు.

# యాదగిరిగుట్టలో బీఆర్ఎస్ శ్రేణులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ఇది కద నిజం, యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మరణించిన బీఆర్ఎస్ శ్రేణుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ పరామర్శించారు. పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం చంద్రయ్య గౌడ్ తల్లి, అలాగే యాదగిరిపల్లి గ్రామానికి చెందిన పలుగుల రాజేష్ తల్లి ఇటీవల మరణించగా, వారి నివాసాలకు వెళ్లి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం తాళ్లగూడెం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ సోదరుడు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన నేపథ్యంలో, వారి కుటుంబాన్ని కూడా కలిసి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు కర్రే వెంకటయ్య, శ్రీహరి, సుగుణాకర్, మిట్ట వెంకటయ్య, కొల వెంకటేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# యశోద ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన గొంగిడి మహేందర్ రెడ్డి



ఇది కద నిజం, సికింద్రాబాద్: ఇటీవల ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడి, సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ప్రమాదానికి గురైన ఎం. క్రాంతి, పత్తి రఘు మరియు పత్తి శేఖర్‌లను కలిసి, వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఆయన, కోలుకునే వరకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలలో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు.

# రేవంత్ రెడ్డి ఒక 'RSS సీఎం'.. బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించాలి: కల్వకుంట్ల కవిత

ఇది కద నిజం,హైదరాబాద్: 'వే టు న్యూస్' నిర్వహించిన కాంక్లేవ్‌లో తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సీఎంలా కాకుండా 'ఆర్ఎస్ఎస్ సీఎం'లా వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిని అరెస్ట్ చేయకుండా రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని, బడేభాయ్-చోటేభాయ్ (మోదీ-రేవంత్) ఒప్పందంలో భాగంగానే రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. బండి సంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉంటే విచారణ సజావుగా సాగదని, ఆయన్ను వెంటనే మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాని మోదీకి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు.

ఉద్యమ కేసీఆర్‌తో సమస్య లేదు.. కానీ:

తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్ గురించి స్పందిస్తూ.. "ఉద్యమ కేసీఆర్ తో నాకు ఎలాంటి సమస్య లేదు, కానీ ముఖ్యమంత్రిగా, బీఆర్ఎస్ అధినేతగా ఉన్న కేసీఆర్‌తోనే నాతో పాటు చాలామందికి సమస్య వచ్చింది" అని వ్యాఖ్యానించారు. పార్టీలో తన భిన్నమైన అభిప్రాయాలను అంతర్గతంగా చెబితే, వాటిని బయటకు వచ్చేలా చేసి తనను పార్టీ నుండి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్ విషయంలో తనపై తప్పుడు ఆరోపణలు వచ్చాయని, ఆ సమయంలో పుట్టింటి వారి నుంచి ఆశించిన మద్దతు లభించలేదని, కానీ అత్తింటి వారు తనకు అండగా నిలిచారని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.




తెలంగాణ రక్షణ సేనతో మార్పు ఖాయం:

రాష్ట్రంలో గుణాత్మక మార్పు కోసమే 'తెలంగాణ రక్షణ సేన'ను ఏర్పాటు చేశామని, వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉచిత విద్య, వైద్యం అందించడమే కాకుండా, యువతను ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగడానికి 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నీళ్ల విషయంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయని, పాలమూరు వలసలు ఆగలేదని విమర్శించారు. తన జీవితంలో ఎదురైన చేదు అనుభవాల నుండే ఈ కొత్త పోరాటం మొదలైందని, 'అక్క'గా మాత్రమే కాకుండా 'అమ్మ'గా ఆలోచిస్తూ వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. చరిత్రలో తన పేరు తెలంగాణ ప్రజలకు మేలు చేసిన వ్యక్తిగా నిలిచిపోవాలన్నదే తన కోరికని కవిత పేర్కొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ ఫామ్ హౌస్ స్క్రిప్ట్ లు చూస్తూ జబర్దస్త్ స్కిట్స్ చేయడం బంద్ చెయ్

**బాధితురాలి ప్రైవసీకి భంగం కలిగించవద్దంటే మా పార్టీ అధినేతను టార్గెట్ చేస్తావా?**

**పొలిటికల్ డ్రామాలు ఆపి నిందితుడిని అరెస్ట్ చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచు**

**టీఆర్ఎస్ నేతలు చిలుక ప్రవీణ్, సూరరపు కృష్ణవేణి**




ఇది కద నిజం,హైదరాబాద్: బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫామ్ హోస్ నుంచి వచ్చే స్క్రిప్టులు చదావుతూ రోజుకో జబర్దస్త్ స్కిట్ చేస్తున్నాడని టీఆర్ఎస్ నేతలు చిలుక ప్రవీణ్, సూరారపు కృష్ణ వేణి మండిపడ్డారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడి పోక్సో కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసిన తమ పార్టీ అధినేత కవిత ను టార్గెట్ చేస్తారా? అని ప్రశ్నించారు. ఈ సంఘటనలో బాధితురాలికి న్యాయం జరగాలన్న ఆకాంక్ష బీఆర్ఎస్ లో ఏమాత్రం కనిపిచటం లేదన్నారు. నిందితున్ని అరెస్ట్ చేసి బాధితురాలి ప్రైవసీని కాపాడాలని కవిత మాట్లాడితే ఆమెపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు చేయటం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో బాధితురాలిని బద్నాం చేసైనా తమ రాజకీయ పబ్బం గడపాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ నేతలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. నిజంగా బాధితురాలికి న్యాయం జరగాలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటి ముందు ధర్నా చేయాలన్నారు.

పొలిటకల్ డ్రామాలే

బండి సంజయ్ కుమారుడి కేసులో బాధితురాలికి న్యాయం జరగాలని, ఆమె ప్రైవసీని కాపాడాలని ఒక అమ్మ మాదిరిగా తమ నాయకురాలు కల్వకుంట్ల కవిత ఆలోచించారని చిలుక ప్రవీణ్ అన్నారు. ఈ క్రమంలోనే నిందితుడు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. బాధితురాలిని బజారుకీడ్చవద్దని కవిత గారు మంచి సూచన చేస్తే బీఆర్ఎస్ నేతలు ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. బాధితురాలికి న్యాయం చేయాలన్న ఉద్దేశం కన్నా కూడా రాజకీయ ప్రయోజనాలు పొందాలన్న ఉద్దేశమే బీఆర్ఎస్ లో ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. ఈ క్రమంలోనే సందర్భం లేకుండా తమ నాయకురాలు కవితపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు చేశారని ప్రవీణ్ అన్నారు. మంచి ఉద్దేశంతో బాధితురాలి తరఫున మాట్లాడిన కవిత గారిపై ఎందుకు ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శలు చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నిజంగా బాధితురాలికి న్యాయం చేయాలనుకుంటే నిందితుడిని దాచిందెవరో మీకు తెలియదా అని ప్రశ్నించారు. నిందితుడిని దాచిన వారిపై, అదే విధంగా నామమాత్రం సెక్షన్స్ పెట్టిన పోలీసులపై ఒత్తిడి పెంచాల్సింది పోయి కవితని ఎందుకు టార్గెట్ చేశారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ కు చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి ఇంటి ముందు, బండి సంజయ్ ఇంటి ముందు ధర్నా చేయాలని సూచించారు. అంతేకానీ పోస్టర్లు వేసి, మెట్రోలో ప్రచారం చేయటం ద్వారా బాధితురాలికి న్యాయం ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు. ఫామ్ హౌస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ లను చదువుతూ రోజుకో జబర్దస్త్ స్కిట్స్ వేయటం ఆర్ఎస్ ప్రవీణ్ మానుకోవాలనిసూచించారు. గత వారం రోజులుగా బీఆర్ఎస్ చేస్తున్న డ్రామాల ద్వారా కేసులో ఏమైనా పురోగతి వచ్చిందా అని ప్రశ్నించారు. ముందు నిందితుడిని పట్టుకోవాలంటూ ప్రభుత్వంపై పోలీసులపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ ను డిమాండ్ చేశారు. కవిత గారికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక ఆమెపై సందర్భం లేకుండా బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. మీ రాజకీయ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారన్నారని సందర్భం వచ్చినప్పుడు కచ్చితంగా బీఆర్ఎస్ కు బుద్ధి చెప్తారన్నారు.

అప్పుడెందుకు మాట్లాడలేదు?

బీఆర్ఎస్ నాయకుడు సంతోష్ దగ్గర ఉండే ఒక వ్యక్తి ఓ మహిళ జర్నలిస్ట్ మరణానికి కారణమైతే ఆర్ఎస్ ప్రవీణ్ అప్పుడెందుకు మాట్లాడలేదని టీఆర్ఎస్ నాయకురాలు సూరరపు కృష్ణవేణి ప్రశ్నించారు. ఆ వ్యక్తిపై పోక్సో కేసు కూడా పెట్టారని గుర్తు చేశారు. పోక్సో కేసు నిందితుడు స్వేచ్ఛగా తిరుగుతున్నది ప్రవీణ్ కుమార్ కు కనిపిచంటం లేదా అని నిలదీశారు. మహిళ జర్నలిస్ట్ చనిపోతే బీఆర్ఎస్ కు చెందిన ఆ టీవీ యాజమాన్యం కూడా ఆమెను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బండి సంజయ్ కుమారుడి పోక్సో కేసులో బాధితురాలికి న్యాయం జరగాలన్నదే తమ పార్టీ ఉద్దేశమని చెప్పారు. ఇలాంటి సంఘటనలను రాజకీయాలకు తాము వాడుకోమని...ప్రజా సమస్యలపై కొట్లాడుతామని అన్నారు.

# తిమ్మానగర్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి



ఇది కద నిజం , ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మే 15:నిజామాబాద్ జిల్లాలోని తిమ్మానగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి వేళ తిమ్మానగర్ కల్లు కంపౌండ్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో పోలీసులు సోదాలు చేపట్టారు. ఈ దాడిలో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోగా, పోలీసులను గమనించిన మరో ఇద్దరు నిందితులు అక్కడి నుండి పరారయ్యారు. అరెస్ట్ అయిన వారి వద్ద నుండి పోలీసులు రూ.5,350 నగదుతో పాటు 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ మహిళా నేతల నిరసన




ఇది కద నిజం, హైదరాబాద్: పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ మహిళా నేతలు భారీ నిరసన చేపట్టారు. మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ మరియు మాజీ కార్పొరేటర్ల నేతృత్వంలో ఈ ధర్నా నిర్వహించారు. నిరసనకారులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అయితే, శాంతిభద్రతల సాకుతో పోలీసులు నిరసనకారులను అడ్డుకుని, వారిని బలవంతంగా లిఫ్ట్ చేసి వాహనాల్లో అఫ్జల్ గంజ్, నాంపల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసుల నిర్బంధానికి ఏమాత్రం లొంగని మహిళా నేతలు, స్టేషన్ ఆవరణలోనే బతుకమ్మ ఆడుతూ వినూత్న రీతిలో తమ నిరసనను కొనసాగించారు. ప్రభుత్వాలు తమ గొంతు నొక్కాలని చూస్తున్నాయని, మహిళలపై అకృత్యాలకు పాల్పడే వారికి శిక్ష పడే వరకు పోరాటం ఆపేది లేదని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

# సినిమా న్యూస్

## నీలాంటి వ్యక్తి దొరకడం నా అదృష్టం



టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే తన గ్లామర్, క్యూట్ నటనతో కుర్రకారు మనసు దోచుకుంది. ఈ అమ్మడు నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోయినప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం అస్సలు తగ్గలేదు. ఆ పాపులారిటీతోనే టాలీవుడ్ స్టార్ హీరోల సరసన వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ దూసుకుపోతోంది. అలాగే తమిళ, మలయాళ చిత్రాల్లోనూ నటిస్తోంది. ఇదిలా ఉంటే.. భాగ్యశ్రీ-రామ్ పోతినేని రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. 'ఆంధ్రా కింగ్ తాలూకా' అనే సినిమా షూటింగ్ సమయం నుంచే రామ్, భాగ్యశ్రీల మధ్య ఏదో నడుస్తోందని, వీరిద్దరూ ప్రేమలో పడ్డారంటూ సోషల్ మీడియాలో రకరకాల వార్తలు తెగ వైరల్ అయ్యాయి. వీరిద్దరూ త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నారంటూ గాసిప్స్ వినిపించాయి. అయితే ఈ రూమర్లపై అటు రామ్ కానీ, ఇటు భాగ్యశ్రీ కానీ ఎప్పుడూ స్పందించలేదు, సైలెంట్‌గా ఉండిపోయారు.

నేడు (మే 15) హీరో రామ్ పోతినేని పుట్టినరోజు కావడంతో, భాగ్యశ్రీ బోర్సే ఆయనకు విష్ చేస్తూ సోషల్ మీడియాలో పెట్టిన ఒక ఇంట్రెస్టింగ్ పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ పోస్ట్‌తో ఆమె తమ మధ్య ఉన్న బంధంపై ఎట్టకేలకు క్లారిటీ ఇచ్చేసింది. జీవితంలో మనకు ఎప్పుడూ ఎవరో ఒకరు స్ఫూర్తిగా నిలుస్తూ ఉంటారు. నిన్ను చూసినప్పుడల్లా నాకు అలాగే అనిపిస్తుంది. నీలోని టాలెంట్, ఎనర్జీ చూసి నేను ఎప్పుడూ ఆశ్చర్యపోతుంటాను. నీలాంటి ఒక గొప్ప వ్యక్తి నా పక్కన మంచి స్నేహితుడిగా ఉన్నందుకు నేను చాలా అదృష్టంగా భావిస్తున్నాను. థాంక్యూ సో మచ్. ఈ పుట్టినరోజు నుంచి నీ జీవితంలో ఒక సరికొత్త ప్రయాణం మొదలవ్వాలి. ఈ ఏడాది నువ్వు సాధించే విజయాలు.. అడవిలో సింహం గర్జించినట్లు, ప్రపంచం మొత్తం మార్మోగిపోయేలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని రాసుకొచ్చింది. భాగ్యశ్రీ పెట్టిన ఈ పోస్ట్‌తో వీరిద్దరి మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమేనని క్లియర్ అయిపోయింది. దీంతో గత కొన్ని రోజులుగా వస్తున్న ప్రేమ, అఫైర్ వార్తలకు ఒక్కసారిగా చెక్ పడినట్లయింది.

## పర్సంటేజ్ విధానంపై కమిటీ ఏర్పాటు

### తెలుగు ఫిలిం ఛాంబర్ కీలక నిర్ణయం


తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతలు మరియు థియేటర్ ఎగ్జిబిటర్ల మధ్య సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో తెలుగు తెలంగాణ ఫిలిం ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజ్ విధానంపై కమిటీ ఏర్పాటు చేసింది. 15 మందితో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్, నిర్మాతలకు చోటు కల్పించింది. కమిటీలో ఒక్కో విభాగం నుంచి ఐదుగురుని నియమించారు. 2 నెలల్లో నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించారు. నిర్మాతలు మరియు థియేటర్ ఎగ్జిబిటర్ల మధ్య పర్సంటేజ్ వివాదం తలెత్తడంతో ఈ సమస్యల పరిష్కారానికి తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ రంగంలోకి దిగింది. ఛాంబర్ అధ్యక్షుడు డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఇరు వర్గాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వాడీవేడీగా జరిగిన ఈ సమావేశంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.




## బాలయ్య బర్త్‌డే స్పెషల్

### రీ రిలీజ్ కానున్న ఇండస్ట్రీ హిట్ ఫిలిం

టాలీవుడ్ సీనియర్ స్టార్ నందమూరి బాలకృష్ణ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈయన పుట్టినరోజు వచ్చిందంటే చాలు ఆయన అభిమానుల్లో ఎక్కడలేని సంతోషం నెలకొంటుంది. ఇక ఈ సంవత్సరం బాలయ్య పుట్టినరోజు సందర్భంగా ఆయన నటించిన ఒక ఇండస్ట్రీ హిట్ చిత్రాన్ని రీ-రిలీజ్ చేయనున్నారు. తాజాగా అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. బాలకృష్ణ చాలా సంవత్సరాల క్రితం సమరసింహారెడ్డి అనే సినిమాలో నటించిన విషయం తెలిసిందే. 1999లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది.




ఇందులో సిమ్రాన్, సంఘవి, అంజలి జవేరి హీరోయిన్లుగా నటించగా బి. గోపాల్ దర్శకత్వం వహించారు. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని సత్యనారాయణమ్మ బ్యానర్‌పై నిర్మించారు. ఆ సమయంలో భారీ విజయాన్ని సాధించిన ఈ చిత్రాన్ని బాలయ్య పుట్టినరోజు సందర్భంగా జూన్ 10వ తేదీన రీ రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రీసెంట్ టైంలో రీ రిలీజ్ అయిన చాలా సినిమాలకు మంచి ప్రేక్షకాదరణ లభించింది. మరి సమరసింహారెడ్డి లాంటి మాస్ ఎంటర్టైనర్ కి ప్రేక్షకుల నుండి ఎలాంటి స్పందన లభిస్తుందో చూడాలి.

## 'వీర'గా కనిపించనున్న రామ్ పోతినేని

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన తదుపరి చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా విడుదల చేశారు. ప్రస్తుతం ఈ సినిమాకు టైటిల్ ఖరారు కాకపోవడంతో 'రాపో23' అనే వర్కింగ్ టైటిల్‌తో మూవీని ప్రకటించారు. ఈ చిత్రానికి కథను స్వయంగా రామ్ పోతినేని అందించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలను కూడా చేపట్టనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రాన్ని కృష్ణ పోతినేని నిర్మించనుండగా, 2026 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఇక ఈ సినిమాలో రామ్ 'వీర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు మూవీ టీమ్ అధికారికంగా వెల్లడించింది. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో రామ్ వెనుక భాగం మాత్రమే కనిపించేలా డిజైన్ చేయడం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచింది. దీంతో త్వరలోనే ఫస్ట్ లుక్ పోస్టర్‌కు సంబంధించిన మరో అప్డేట్‌ను మేకర్స్ విడుదల చేసే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




## శర్వానంద్ జోడీగా?

ఇటీవల విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది మాజీ మిస్ ఇండియా మానస వారణాసి. ఈ సినిమా విజయంతో ఈ భామకు తెలుగులో భారీ ఆఫర్లొస్తున్నట్లు వినికిడి. తాజా సమాచారం ప్రకారం శర్వానంద్‌తో కలిసి ఆమె ఓ చిత్రంలో నటించబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. శర్వానంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో 'జార్జ్ క్రిష్' పేరుతో ఓ రొమాంటిక్ కామెడీ చిత్రం తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని కంఫర్మ్ చేసినట్లు తెలిసింది.



ఈ సినిమాలోని కథానాయిక పాత్ర కోసం అనంతిక సనీల్‌కుమార్, రుక్మిణి వసంత్, మమితాబైజు పేర్లు మొన్నటివరకూ వినిపించాయి. చిత్రబృందం చివరకు మానస వారణాసి వైపే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది.